# శరణం... మరణం... గచ్ఛామి!

శంకరశ్రీనివాసరావు



ఉదయం నుండీ యమధర్మరాజు గాబరాగా ఉన్నాడు. యమలోకం కార్యకలాపాలు పర్యవేక్షించడానికి విష్ణువు, బ్రహ్మ, శివుడు మరికొందరు ఎగ్జిక్యూటివ్ మెంబర్సు తనిఖీకి రానున్నారని నారదుడు ఉత్తర్వులు తీసుకువచ్చాడు. అదిగో అప్పటి నుండే యమధర్మరాజు గాబరా మొదలైంది. ఇలాంటి సంక్లిష్ట పరిస్థితులలో తెలివిగా వ్యవహరించి ఆదుకునే చిత్రగుప్తుడు కూడా శెలవులో ఉన్నాడు.

డజను టీలు వరుసగా త్రాగి రెండు చేతుల్లో జుట్టు పీకేసుకుంటూ తనిఖీ వాయిదా వేయించడానికి ఏమైనా మార్గాలున్నాయేమోనని యమధర్మరాజు ఆలోచించారు. తల వేడెక్కి సెగలు రావడం మొదలయ్యాయిగాని మంచి ఆలోచనేం రాలేదు. ఆలోచనల వల్ల కాలయాపనతప్ప ప్రయోజనం ఉండదని ఒక నిర్ణయానికి వచ్చి రికార్డు రూమ్‌వైపు నడిచాడు. రికార్డు కాగితాలన్నీ చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. చాలావరకు చెదలుపట్టి, ఎలుకలు కొరుక్కుతిని చరమస్థితిలో ఉన్నాయి. ఆ రికార్డులన్నీ పరిశీలించి ప్రగతి పట్టిక తయారుచేయడం కంటే ఉద్యోగం రాజీనామా చేయడం మంచిదనిపించింది. ఆఫీసు పని మొదలుపెట్టే ముందు ప్రతి ఉద్యోగికి అలాంటి వైరాగ్యం మామూలే కదా! ఒక పక్షం రోజులపాటు యమలోకం హడావిడి పడింది. యమభటులందరికి ఆజ్ఞలు జారీ చేయబడ్డాయి. వీధులు, కారాగారాలు, శిక్షా శిబిరాలు అన్నీ శుభ్రంగా తయారయ్యాయి. భటులంతా యూనిఫాం శుభ్రపరచుకుని తనిఖీకి సిద్ధమయ్యారు. కష్టపడి శ్రమపడి యమధర్మరాజు కాకుల లెక్కలు తయారు చేశాడు.

అనుకున్న సమయానికి రెండు ఝాములు లేటుగా బ్రహ్మ, విష్ణు, శివులు అద్దె హెలికాప్టర్‌లో దిగారు. బాజాభజంత్రీలతో యమధర్మరాజు స్వాగతం పలికాడు. పూలదండలు, సుగంధ పరిమళాలతో ముంచెత్తాడు. కొంత సమయం విశ్రాంతి, మరికొంత సమయం విందుకి కేటాయించబడింది. తర్వాత నామమాత్రంగా ప్రగతి పట్టిక పరిశీలించి క్రింద అధ్యక్ష సంతకం పెట్టబోతూ విష్ణువు నొసలు చిట్లించాడు. నాలుగు తలల బ్రహ్మ, శివుడు, యమధర్మరాజు అర్థోచితంగా ఆయన ముఖంలోకి చూశారు. ఏమిటన్నట్లు?

మృతుల సంఖ్యలో చావుకొరకు ఎదురుచూసిన వారి సంఖ్య ఎక్కువగా ఉంది. విష్ణువు నొసలు ముడుచుకోవడానికి కారణం గ్రహించి యమధర్మరాజు కంగారుపడ్డారు. పట్టిక తయారుచేసినప్పుడే ఆ విషయం గమనించాడుకాని, మరో మారు రికార్డులు పరిశోధించే వ్యవధి లేకపోయింది.

'ఈ మధ్య భూలోకంలో అలాగే జరుగుతోంది' అని నసిగాడు. విష్ణువు ఓసారి బ్రహ్మవైపు చూసి 'నీ సృష్టి ఇలా మరణంకోసం ఎదురు చూస్తూ ఉందేమిటి'? అన్నాడు.

బ్రహ్మ తలలు వంచుకుని విష్ణువుకి మాత్రమే అర్థమయేట్లు ప్రత్యేక భాషలో ఏదో చెప్పారు. విష్ణువు నాలుగు చేతులు నలుపుకుని ఒక నిర్ణయానికి వచ్చినట్లు తలపంకించాడు.

యమధర్మరాజు వైపుకి తిరిగి 'ప్రత్యేక కమిటీ వేసి కారణం రాబట్టండి. అవసరమైతే శారీరక లోపాలు ఉన్నాయేమో పోస్టుమార్టమ్ చేయించండి. పూర్తి వివరాలతో నివేదిక పంపించండి' అంటూ ఒక అరడజను ఆదేశాలు జారీచేసి సభ్యతకోసం 'మీరేమంటారు'? అన్నాడు శివుని వైపు తిరిగి. మెడలోని పాముతో ఆడుకుంటున్న శివుడు డిస్టర్బ్ అయి 'అవునవును అలా చేయండి' అన్నాడు లోపాయికారిగా!

*** *** ***

ప్రధాన వైద్య నిపుణుడు, మరో నలుగురు నిపుణులు పోస్టుమార్టమ్‌కోసం పరికరాలన్నీ సిద్ధపరిచారు.

థియరి నేర్చుకోవడమే కాని ప్రాక్టికల్స్‌లో అనుభవం లేని ప్ర.వై.ని సబ్జెక్టుని లోలోపలే గుర్తు తెచ్చుకోవడానికి ప్రయత్నం చేస్తున్నాడు. ఒక సగటు మానవుడి మృత శరీరాన్ని టేబులు మీదికి చేర్చారు. చేతికి గ్లవుజులు వేసుకుని ముందుగా గుండె భాగంలో కోశారు.

ఆశ్చర్యం! గుండెస్థానంలో గుండె లేదు. ఆ ప్రదేశమంతా ఖాళీగా ఉంది. సాలెపురుగుల నివాసం లాగా అంతా బూజుతో నిండి ఉంది. ప్రక్కనే నిలబడి ఉన్న ఒక వ్యక్తి పోస్టుమార్టమ్ వివరాలన్నీ ఒక పొడవాటి పుస్తకంలో బరబరా రాసేస్తున్నాడు. వైద్యులు రెండు ఘడియలు ఆశ్చర్యపోయి కార్యక్రమం తిరిగి కొనసాగించారు. రెండవ కోత ఉదరం మీద కోశారు.

దట్టమైన పొగవచ్చింది. సగం కాలిన సిగిరెట్టు పీకలు, కిళ్ళీలు, చెత్తాచెదారం కనిపించాయి. అవన్నీ శుభ్రపరిచాక ఉండచుట్టిన కాగితాలు కనిపించాయి. వైద్యులా కాగితాల దొంతర విప్పారు. ప్రేగులు బాగా కుంచించుకు పోయి దారాలుగా మారి ఉన్నాయి. కాగితాల నిండా ఏవేవో అంకెలు వాటి వివరాలు ఉన్నాయి. ఎవరెవరికి ఎంతెంత బాకీనో, వడ్డీ ఎంత చెల్లించాలో, మొదటిసారి తను బాకీ పెట్టడానికి కారణం. తేదీ, వివరాలు, కూతురు పెళ్ళికి అమ్మిన భూమి వివరాలు, ముందే కూతురు పెద్దమనిషి అయినప్పుడు తాకట్టు పెట్టిన పెళ్ళాం పుస్తెల వివరాలు, అల్లుడి అలకతీర్చడానికి అయిన అప్పులు, పిల్లల చదువు ఖర్చు, ఇంటి అద్దె, పాల ఖర్చు, కిళ్ళీకొట్టు బాకీలాంటివి పైసలతో సహా వివరంగా వ్రాసి ఉన్నాయి. ప్రతి నెల ఆదాయం, ఖర్చు వివరంగా ఉన్నాయి. ప్రతిసారి ఆదాయమే తక్కువగా ఉండేది. వైద్యులా దొంతరని ప్రక్కన ఉంచారు.

కనుగుడ్లు పీకారు. లోపల రకరకాల రంగుల దృశ్యాలు కదులుతూ కనిపించాయి. విశాలమైన ఖాళీస్థలం మధ్య చిన్న పెంకుటిల్లు. చుట్టూ పూలమొక్కలు. ఆ ఇంటికి కరెంటు, నీళ్ల పంపున్న బాత్‌రూమ్ లాంటి సౌకర్యాలు ఒక దృశ్యంలో ఉన్నాయి. ఇంకా సముద్రం ఒడ్డున భార్యాపిల్లల్తో వేడిగుడు లాడటం అద్దెసరు నవులమొహం, సరగుచెట్లులో వనభోజనాలు, కొడుకులు కూతుళ్ళు తన భుజం చుట్టూ చేతులు వేసుకుని ఆప్యాయంగా మాట్లాడటం, భార్య ప్రతి రోజు తనని గౌరవంగా చూడటం, నా కేమీ వద్దు మీరుంటే చాలు అన్నట్లు ప్రేమగా చూస్తూ ఉండటం ఇలాంటి తీరని కోర్కెలు చాలా దృశ్యాలుగా ఉన్నాయి.

ఒక ఝాముకాలం పట్టిందా వైద్యులకి ఆ కార్యక్రమం నిర్వహించేందుకు. తీరా ప్రాణులు చావుని ఆహ్వానించడానికి ప్రత్యేకమైన కారణాలేవి కనిపించలేదు. శరీరంలోని ఎక్కువ భాగాలు చెడిపోయాయి. ఒక్క మెదడులోని ఆలోచించే భాగం తప్ప. మరునాడు సాయంత్రానికి పై విషయాలు విశదీకరిస్తూ రిపోర్టు పంపించబడింది.

రిపోర్టంతా పరిశీలించాక బ్రహ్మ, విష్ణువుతో అన్నాడు. ఎటూ నే అమర్చిన మెదడుతో ఉపయోగపడటం లేదు కాబట్టి ఇక నుండి తక్కువ మెదడుతో సృష్టికొనసాగిస్తాను.

విష్ణువు తన నాలుగు చేతుల్తో నైపుణ్యంగా దోములు తరిమికొడ్తూ 'మానవులంతా అన్యాయం జరిగిందని దండెత్తి రాగలరు' అన్నాడు. నాలుగు తలలూ ఊడేట్టు బ్రహ్మ నవ్వి అన్యాయం జరుగుతుంది అని తెల్సి వెంటనే పోరాటానికి దిగే లక్షణమే మానవులకి ఉంటే చావుకోసం ఎదురు చూడాల్సిన పని ఉండేది కాదు అన్నాడు. ఈ కథని ఇంతటితో ముగిస్తాను. ●